నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కమలా హారిస్, టిమ్ కుక్‌తోనూ భేటీకానున్న మోదీ !

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల చివర్లో అమెరికా వెళ్తున్న విషయం తెలిసిందే. ఆ పర్యటనలో ఆయన అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, యాపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్‌లను మోదీ కలవనున్నారు.

మేటి వ్యాపారవేత్తలతోనూ ఆయన సంప్రదింపులు జరపనున్నారు. కమలా హారిస్‌ను కలిసిన రోజే.. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్, జపనా ప్రధాని యోషిడే సుగాలను కూడా మోదీ కలుసుకునే అవకాశం ఉన్నది.

ఆఫ్ఘనిస్తాన్ అంశంపై అధ్యక్షుడు బైడెన్‌తో మోదీ చర్చించనున్నారు.

కోవిడ్19, వాతావరణ మార్పులు, ఇండో పసిఫిక్ వాణిజ్యం, ఉగ్రవాదం లాంటి అంశాలను కూడా వారు చర్చిస్తారు. సెప్టెంబర్ 23వ తేదీన బైడెన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత రోజు క్వాడ్ సమావేశాల్లో పాల్గొంటారు. 24వ తేదీన యూఎన్ జనరల్ అసెంబ్లీలో మోదీ ప్రసంగిస్తారు.

హైదరాబాద్ మంగళవారం 21-9-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 47 పేజీలు:4 వెల: రూ.1/-

రష్యా యూనివర్సిటీలో కాల్పులు.. 10 మంది మృతి

మాస్కో, సెప్టెంబర్ 20: రష్యాలో పార్లమెంట్ ఎన్నికల వేళ రక్తం పారింది. ఆ దేశానికి చెందిన పెర్మ్ నగరంలో జరిగిన కాల్పుల్లో అనేక మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఓ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ ఘటన జరిగింది. కాల్పులకు పాల్పడిన దుండగుడిని పట్టుకున్నారు. ఓ బిల్డింగ్ నుంచి అనేక మంది విద్యార్థులు భయంతో పారిపోతున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. పెర్మ్ స్టేట్ యూనివర్సిటీలో కాల్పుల ఘటన జరిగింది. ఇది అత్యంత ఓల్డ్ యూనివర్సిటీ. వీలైతే క్యాంప్‌ను వదిలి వెళ్లండి లేదా రూమ్‌ల్లోనే తాళాలు వేసుకుని ఉండాలని ఇవాళ ఉదయం యూనివర్సిటీ ఓ అలర్ట్ ఇచ్చింది. పెర్మ్ నగరంలో ఉన్న వైద్య అధికారులు సుమారు 10 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇంకా ఎక్కువ సంఖ్యలో మరణాలు సంభవించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ, సెప్టెంబర్ 20:: స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు కేటాయించి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షులతో ఆయన మాట్లాడారు.

ఇటీవల ఎంపీటీసీలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించినందుకు మంత్రి ఎర్రబెల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎంపీపీలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీలతో మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి తోనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందన్న నిజాన్ని గుర్తించి సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు.

పల్లెల్లో నూతన కాంతులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పంచాయతీ రాజ్ యాక్ట్ 2018 సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి నిధులు కొరత ఉండ కూడదనే లక్ష్యంతో ప్రతి నెల 227 కోట్ల 50 లక్షల రూపాయలు గ్రాంటును గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

అందులో గ్రామ పంచాయతీలకు 210 కోట్ల 44 లక్షల రూపాయలు, మండల పరిషత్ లకు 11 కోట్ల 41 లక్షల రూపాయలు, జిల్లా పరిషత్‌లకు 5 కోట్ల 65 లక్షల రూపాయలు ప్రతి నెల తప్పక విడుదల చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2019 సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు 6 వేల 955 కోట్ల రూపాయలు రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేయడం జరిగిందన్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పరిషత్ లో 251 కోట్ల రూపాయలు, మండల పరిషత్‌లకు 249 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు.

ఆర్టీసీలో కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం

హైదరాబాద్ , సెప్టెంబర్ 20:నష్టాలతో ఇబ్బంది పడుతున్న తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ ఆర్టీసీ) ని గాడీలో పెట్టెందుకు ఆర్టీసీ ఎండీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సజ్జనార్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. తను పనిచేస్తున్న సంస్థలో ప్రయోగాలు చేసి సక్సెస్ సాధించడం సజ్జనార్‌కు అలవాటే. అందులో భాగంగా ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశగా ఆయన చర్యలు మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆయన ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

బాధ్యతల స్వీకరించిన వెంటనే సజ్జనార్ ఇటీవల ఎంజీబీఎస్‌ను తనిఖీ చేశారు. అలాగే గ్రేటర్ జోన్ లో మరన్ని ఆకస్మిక తనిఖీలు చేపట్టడానికి ఆయన సిద్ధమయ్యారు. నష్టాలు తగ్గించుకోవడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రత్యేక కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

బస్సుల రాకపోకలు, ప్రయాణికుల రద్దీ, ఇతర సమస్యలపై సూచనలు తీసుకుని, సమస్యలకు పరిష్కారం చూపనున్నా రు. ఇందుకోసం కోఠి- 99592 26160, సికింద్రాబాద్ -83339 04531 నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే, శివారు ప్రాంతాలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఎక్కువ బస్సులు నడపనున్నారు. గ్రేటర్ లో కీలకమైన జేబీఎస్ , ఎంజీబీఎస్‌లలో ఖాళీగా ఉన్న దుకాణాలపై దృష్టి సారించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశించారు.

అలాగే శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు పుష్పక్ ఏసీ బస్సుల టైం టేబుల్‌ను ఫోన్‌లో తెలిపే ఏర్పాట్లు చేస్తున్నారు. 8385047693, 7382925971 నంబర్లకు ఫోన్ చేసే ఏ స్టాప్ కు ఏ సమయంలో బస్సులు వస్తాయో తెలుసుకునే వీలుంటుందని ఆర్టీసీ అధికారులు ప్రచారం చేస్తున్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ మొదడించ- మొసములందున
సగ గమలను నింపగలుగు సద్గురు మూర్తియా
"గురు సాల వెంకటేశు"కు
సరసిజ నేత్రుం డొసగెను శుభవిజయంబుల్ !!

(సెప్టెంబర్ 21 పుట్టినరోజు...) సంగీత దర్శకుడు జి.కే. వెంకటేష్ -రాధశ్రీ

సెల్: 9494481210

ఆర్టీసీ ఆస్తులు అమ్మే ప్రసక్తే లేదు: బాజిరెడ్డి గోవర్ధన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 20: ఆర్టీసీ ఆస్తులు అమ్మే ప్రసక్తే లేదని, సంస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీయబోని స్పష్టం చేశారు. ఆసియాలోనే నంబర్ వన్‌గా ఉన్న సంస్థ నష్టాల బారిన ఎందుకు పడిందో అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఆయన ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం మాట్లాడుతూ.. రోజూ రూ.13 కోట్లుగా ఉన్న సంస్థ ఆదాయం కరోనాతో రూ.3 కోట్లకు తగ్గిందని చెప్పారు. ఇప్పుడిప్పుడే మళ్లీ పుంజుకుంటుందని, ప్రస్తుతం రూ.10 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. కష్టపడే తత్వమున్న సజ్జనార్ ఆర్టీసీ ఎండీగా నియమితులయ్యారని చెప్పారు. సంస్థ ఆదాయాన్ని తిరిగి రూ.13 నుంచి 14 కోట్లకు చేరుస్తామన్నారు.

కరోనా తర్వాత 95 శాతం బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చెప్పారు. సిబ్బందికి 100 శాతం వ్యాక్సినేషన్ పూర్తయిందన్నారు. ఆర్టీసీకి ప్రజల ఆదరణ చాలా అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆర్టీసీ సేవలను పునఃప్రారంభిస్తామన్నారు. వంద శాతం సురక్షిత ప్రయాణంతో బస్సులను నడుపుతమని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు వ్యాక్సినేషన్.. కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:దివ్యాంగులకు కోవిడ్ టీకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నదో వెల్లడించాలని ఇవాళ సుప్రీంకోర్టు కోరింది. దీవై చంద్రచూడ్, బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఎన్జీవో ఎవరా ఫౌండేషన్ వేసిన పిటిషన్‌కు కోర్టు స్పందించింది. రెండు వారాల్లోగా ఈ అంశంపై కేంద్రం వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. దివ్యాంగులకు వ్యాక్సిన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని పిటిషన్‌లో కోరారు. వ్యాక్సిన్ స్లాట్ల సమయంలో దివ్యాంగులకు ప్రిఫరెన్స్ ఇవ్వాలని ఎన్జీవో కోర్టును కోరింది. కోవిన్‌తో పాటు వ్యాక్సిన్ బుకింగ్ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

ఇంటిముందు పార్క్? చేసిన స్కూటర్ మాయం

హైదరాబాద్ , సెప్టెంబర్ 20:బంజారాహిల్స్ : ఇంటిముందు పార్క్? చేసిన స్కూటర్ చోరీ అయిన ఘటన బంజారాహిల్స్? పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్? రోడ్ నెం 5లోని దేవరకొండబస్తీలో నివాసం ఉంటున్న షిరీన్ ఫాతిమా ఓ ప్రైవేటు సంస్థలో సేల్స్?గర్ల్‌గా పనిచేస్తోంది.

ఈనెల 18న సాయంత్రం తన ఇంటిముందు హోండా యాక్టివా స్కూటర్ (టీఎస్ 11ఏసీ టీఆర్6431) ను పార్క్? చేసింది. మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా స్కూటర్ కనిపించలేదు. దీంతో అన్ని ప్రాంతాలలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం బంజారాహిల్స్? పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వాన

హైదరాబాద్ , సెప్టెంబర్ 20:హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, హయత్‌నగర్‌తోపాటు నగరంలోని చార్మినార్‌లో భారీగా వాన కురిసింది. అత్యధికంగా బహదూర్‌పురాలో 9 సెంటీమీటర్లు, చార్మినార్‌లో 5.5 సెంటీమీటర్లు, సైదాబాద్‌లో 4 సెంటీమీటర్లు, ఝాన్సీబజార్‌లో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అదేవిధంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా వర్షం కురిసింది. వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో భారీ వర్షం కురింసింది. మహబూబాబాద్‌లో కూడా వాన పడింది.

కాగా, హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాన కురవడంతో రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతున్నది. భారీ వానతో రోడ్లపై నీరు నిలువకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు జాగ్రత్తపడుతున్నారు.

ఏపీ పరిషత్ ఎన్నికలపై మరింత విశ్లేషణ చేయాలి: పవన్

అమరావతి, సెప్టెంబర్ 20:ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన సందర్భంగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. అధికారిక ఫలితాల ప్రకారం జనసేన అభ్యర్థులు 177 ఎంపీటీసీ స్థానాలు, 2 జడ్పీటీసీ స్థానాలు గెలుచుకున్నారని పవన్ పేర్కొన్నారు. ఏప్రిల్ 8న జరిగిన పరిషత్ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసిన అభ్యర్థులు బలమైన పోరాటం చేశారని అన్నారు. పార్టీ తరఫున విజయం సాధించినవారికి జనసైనికుల తరఫున, పార్టీ నేతల తరఫున హృదయపూర్వక అభినందనలు అంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు.

ఏపీలో పరిషత్ ఎన్నికలు ఎలాంటి పరిస్థితుల్లో, ఏ నేపథ్యంలో జరిగాయి అనేందుకు తమ వద్ద పూర్తి సమాచారం ఉందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అయితే, అదనపు సమాచారం కోసం చూస్తున్నామని, ఒకట్రెండు రోజుల్లో దీనిపై సంపూర్ణ విశ్లేషణ చేపట్టి మరోసారి ప్రజల ముందుకు వస్తానని పవన్ తెలిపారు.

బాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసి పురోగమించాలి: ఎర్రబెల్లి

హైదరాబాద్ , సెప్టెంబర్ 20: తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ గా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరై బాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆర్టీసీ చైర్మన్ బాధ్యలు స్వీకరించిన బాజిరెడ్డికి అభినందలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో, బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.సామాన్యుడి ప్రయాణ రథం అయిన ఆర్టీసి బస్సు ప్రగతి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.ఆర్టీసీ దినదిన ప్రవర్ధ మానమై, ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా చేయాలని అన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారం : మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి): తొగుట : సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే మొదటి వరుసలో ఉన్నదని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. సోమవారం ఆయన మండలంలోని పెద్దమాసాన్‌పల్లి టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన బోయిని శ్రీనివాస్‌ను సన్మానించి మాట్లాడారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ప్రతిపక్షాల నాయకులు ఓర్వలేక అసత్యాలను ప్రచారం చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కంది రారెడ్డి, మెట్టు స్వామి తదితరులున్నారు.

చేప పిలలు ఉచితంగా ఇచిన మేమే చేపలను మళ్లీ కొంటాం: తలసాని

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ వ్యాప్తంగా వివిధ చెరువుల్లో విడుదల చేస్తున్న చేప పిల్లలు పద్దవి అయిన తర్వాత మత్స్యకారుల నుంచి తిరిగి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పుశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. దీని వల్ల మత్స్య కారులకు గిట్టుబాటు ధర రావడమే కాకుండా ప్రభుత్వం కూడా చేపలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుందన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలం లోని అన్నపూర్ణ రిజర్వాయర్ లో చేప పిల్లలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో కలిసి విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకే కులవృత్తులకు ప్రభుత్వ చేయూత నిస్తోందని అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మత్స్యకారులు తక్కువ ధరకు చేపలు అమ్మి నష్టపోవద్దని, మత్స్య ఫెడరేషన్ ద్వారా నేరుగా సొసైటీల నుండి చేపలను కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్య శాఖకు నామ మాత్రపు నిధుల కేటాయింపు జరిగింది. కానీ తెలంగాణ ప్రభుత్వం పెద్దయెత్తున నిధులను విడుదల చేస్తోందన్నారు. గొల్ల, కురుమలకు గొర్రెలను అందజేస్తున్నామని, దళితుల ఆర్థికాభివృద్ధి కోసమే దళిత బంధు పథకం అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

దస్తురాబాద్, సెప్టెంబర్ 20:: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా అధికారి ఏ.రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలను, కస్తూర్బా గాంధీ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలను, వంట గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు ఇద్దరు విద్యార్థులను దత్తతను తీసుకోవాలని, విద్యార్థుల నుంచి వారి నైపుణ్యాన్ని వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు 10 జీపీఏ వచ్చే విధంగా కృషి చేయాలని, విద్యార్థులకు ఆన్ లైన్ క్లాసులలో బోధించాలని వెల్లడించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని అన్నారు.విద్యార్థులకు ఒత్తిడి లేకుండా అర్థం చేసుకునే విధంగా బోధించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలలకు ఎక్కువ సంఖ్యలో వచ్చే విధంగా చూడాలని అన్నారు. కొవిడ్ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు బోధించాలని, అన్ని విధాలుగా ప్రభుత్వ పాఠశాలలో మార్పు కన్పించే విధంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని కోరారు.

మత్స్యరంగానికి ఊపిరి పోసిన సీఎం కేసీఆర్ : మంత్రి తలసాని

సిద్దిపేట, సెప్టెంబర్ 20 : రాష్ట్రంలో మత్స్యరంగానికి ఊపిరి పోసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జిల్లా కలెక్టర్ పి వెంకట్రామ్‌రెడ్డితో కలిసి బెజ్జంకి మండలం తోటపల్లి రిజర్వాయర్‌లో లక్షా 80 వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. .సమైక్య రాష్ట్రంలో కులవృత్తుల నిరాధరణతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ధ్వనీనం అయిందన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడానికే ప్రభుత్వం సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా 2014 నుంచి ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుందన్నారు. కులవృత్తులకు పూర్వ వైభవం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ సంవత్సరం రూ.115 కోట్లతో 93 కోట్ల చేప పిల్లలను, 25 కోట్ల రొయ్య పిల్లలను జల వనరుల లో విడుదల చేస్తున్నాం.సిద్దిపేట జిల్లాలో రూ.4 కోట్ల 87 లక్షల రూపాయలతో అన్ని జలాశయాలు, చెరువుల్లో 4 కోట్ల 19 లక్షల చేప, రొయ్య పిల్లలను వదులుతున్నామని వివరించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంతో స్వరాష్ట్రంలో మత్స్యకారుల జీవితాల్లో సీఎం కేసీఆర్ కొత్త వెలుగులు నింపారని ప్రశంసించారు.మత్స్య కారులు జిల్లా ఫిషరీస్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పండుగ వాతావరణంలో ప్రతి చెరువులో చేప పిల్లల విడుదల చేయాలన్నారు. చేప పిల్లల విడుదల కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం చేయాలి.

విడుదల ప్రక్రియ ఆద్యాంతం వీడియోగ్రఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తయితే 2 లక్షల ఎకరాలకు సాగునీరు, తోటపల్లి జలాశయంతో 75 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి తలసాని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం

హైదరాబాద్ , సెప్టెంబర్ 20: గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ హుస్సేన్ సాగర్ లో గణేష్ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగక పోవడంతో పోలీసులు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గణేష్ నిమజ్జనం పై హైకోర్టు ఉత్తర్వులతో కొంత అయోమయం నెలకొన్నా సుప్రీం కోర్టు అనుమతి ఇవ్వడంతో జంటనగరాల్లో వేల సంఖ్యలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలన్నీఅధిక శాతం ఆఖరు రోజైన ఆదివారం రోజే గణేష్ నిమజ్జనానికి తరలించారు.

పోలీసులు, జీహెచ్ఎంసి, వాటర్వోర్డు, విద్యుత్, ఆర్అండ్ బి, హుడా, తదితర శాఖలన్నీ సమన్వయంతో వ్యవహరించడం వల్ల నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ మంత్రి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ శోభాయాత్ర సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని అన్నారు. ప్రత్యేకించి జీహెచ్ఎంసి, పోలీసు, ట్రాఫిక్ పోలీసు, ఎలెక్ట్రికల్, ఆర్ అండ్ బి, వాటర్ వర్క్స్, రెవెన్యు, అగ్నిమాపక శాఖ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వానికి, అధికారులకు సహకరించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ, ఉత్సవ మండపాల నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అక్టోబర్ 20 నుంచి షర్మిల పాదయాత్ర

హైదరాబాద్ , సెప్టెంబర్ 20:తెలంగాణలో పాదయాత్రకు సిద్ధమవుతున్నారు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల. అక్టోబర్ 20న చేవెళ్ల నుంచి యాత్ర ప్రారంభం కానున్నట్లు షర్మిల తెలిపారు. కాగా ఏడాది పాటు కొనసాగుతుందని.. మళ్లీ చేవేళ్లలోనే ముగిస్తామని వెల్లడించారు. మొత్తం 90 నియోజకవర్గాల్లో షర్మిల పాదయాత్ర కొనసాగనుంది.. తెలంగాణలో అన్ని పార్టీలు అమ్ముడు పోయాయని ఆరోపిస్తున్న షర్మిల.. టీఆర్ఎస్‌కు మేమే ప్రత్యామ్నాయం అంటున్నారు.. వైఎస్ ప్రజా ప్రస్థానం మొదలు పెట్టిన చేవెళ్ల నుంచే యాత్ర ప్రారంభిస్తున్నాం.. పాదయాత్రలో బ్రేక్‌లు ఉండవని ప్రకటించిన వైఎస్ షర్మిల.. ఏడాదిపాటు పాదయాత్ర కొనసాగుతుంది.. చేవెళ్లలో ప్రారంభమై.. చేవెళ్లలోనే ముగిస్తామని తెలిపారు.గతంలో వైఎస్ జగన్ పాదయాత్రకు కొనసాగింపుగా.. కొన్ని రోజుల పాటు పాదయాత్ర చేశారు షర్మిల.. ఇప్పుడు.. తెలంగాణలో రాజన్న రాజ్యం లక్ష్యంగా కొత్త పార్టీ ఏర్పాటు చేసిన ఆమె.. ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్నారు.. ఇప్పటికే ప్రతీవారం నిరుద్యోగ దీక్ష కొనసాగిస్తూ వస్తున్న ఆమె.. ఇక, వచ్చే నెల నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు.. ఇవాళ తన పాదయాత్ర షెడ్యూల్ ప్రకటించారు షర్మిల. తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గతంలో చేవేళ్ల నుంచే పాదయాత్రను ప్రారంభించారు.. ఆయన పాదయాత్ర కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ఎంతో దోహదం చేసింది.. ఇక, వైఎస్ షర్మిల కూడా నాన్నకు కలిసివచ్చిన చేవెళ్ల నుంచే పాదయాత్రను ప్రారంభించనున్నారు.

ఆహ్వానం

తెలుగు వెంకటేష్ కవిత్వం

తూనీగతో సాయంకాలం

ఆవిష్కరణసభ

25.09.2021,
శనివారం
సా. 6 గం.లకు

షోయబ్ హాల్
సుందరయ్య విజ్ఞాన కేంద్రం
హైదరాబాద్

నామాడి శ్రీధర్
శిలాలోలిత
అంబటి సురేంద్రరాజు
కోడూరి విజయకుమార్
రాళ్లబండి శశిశ్రీ
కవియాకూబ్
అనంత్ చింతలపల్లి
పాల్గొంటారు.

ఆహ్వానం
ప్రేమలేఖ ప్రచురణ
కవిసంగమం

కార్బన్ ఉద్గారాలతోనే పర్యావరణానికి పెనుప్రమాదం

(21 సెప్టెంబర్ 'శూన్య ఉద్గార దినం' సందర్భంగా)

పర్యావరణ కాలుష్యానికికార్బన్‌తో పాటు ఇతర ఉద్గారాలే ప్రధాన కారణం అని ప్రపంచ మానవాళికి అవగతం అవుతున్న వేళ, కార్బన్ ఉద్గారాలను క్రమంగా తగ్గించే పటిష్ట ప్రణాళికలు అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. శిలాజ ఇంధనాల విచ్చలవిడి వాడకంతో వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి కార్బన్ ఉద్గారాలు చేరుతాయి. కార్బన్ ఉద్గారాలు పెరిగితే 'భూతాపం (గ్లోబల్ వార్మింగ్)'తో సకల జీవకోటి ఉనికి ప్రమాదంలో పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల దుష్ప్రభావాలను వివరించడానికి, శూన్య ఉద్గార లక్ష్యానికి చేరువకావడం, కార్బన్ ఉద్గార ఇంధనాల వినియోగాన్ని తగ్గించడం లాంటి విషయాల పట్ల విస్తృత ప్రచారం చేసేందుకు ప్రతి ఏట 21 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'శూన్య ఉద్గార దినం (జీరో ఎమిషన్ డే, జీడే)' పాటిస్తారు. 'ఏడాదిలో ఒక రోజైనా భూగోళానికి ఉద్గారాల దుష్ప్రభావాల నుంచి ఉపశమనం కలిగిద్దాం' అంటూ, భూమికి 'విశ్రాంతి దినం'గా మానవాళి నినదించే సందర్భామిది.

ఘన, ద్రవ, వాయు శిలాజ ఇంధనాలను విస్తృతంగా వినియోగించడంతో గాల్లోకి ప్రమాదకర కార్బన్ ఉద్గారాలు చేరతాయి. వీటిలో కార్బన్ డై ఆక్సైడ్‌తో భూతాపం, కార్బన్ మోనాక్సైడ్‌తో విష ప్రభావం కలుగుతాయి. యల్‌పిజి, పెట్రోల్, డిజిల్, కిరోసిన్, బొగ్గు లాంటి ఇంధనాల దహన క్రియలో కార్బన్ ఉద్గారాలు విడుదల కావడం తప్పనిసరి. ఇలాంటి అత్యంత పర్యావరణ విచ్ఛిన్నకర విషయాలను వివరించాలనే సదుద్దేశంతో 2008 నుంచి 'జీడే'ను నిర్లక్ష్యిస్తున్నారు. శిలాజ ఇంధనాల వినియోగంతో కార్బన్ ఉద్గారాలతో పాటు పలు ఇతర కాలుష్యాలు, సూక్ష్మ కణాలు (మైక్రోపార్టికిల్స్), విషలోహం లెడ్, పొగరూపంలో పార్టిక్యులేట్ మ్యాటర్ కూడా గాలిలో కలిసిపోయి పర్యావరణ అనారోగ్యానికి కారణం అవుతాయి. తరిగే సాంప్రదాయ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేచర తరగని ఇంధనాల వాడాకాన్ని ప్రోత్సహించాల్సిన అగత్యం ఏర్పడింది. ప్రపంచ దేశాలు 21 సెప్టెంబర్ రోజున 24-గంటలు శిలాజ ఇంధనాల వాడకాన్ని నిషేధించాలని సూచించబడింది. 21 సెప్టెంబర్ రోజున ఇంధన వాహనాలు వాడకుండా సైక్లింగ్ లేదా కాలి నడకన ప్రయాణిద్దాం. ఇంధన వాడకాన్ని తగ్గిస్తూనే రీయూజ్, రెడ్యూస్, రీప్యూజ్, రీసైకిల్, రిమువ్ సూత్రాలను అనుకూలతను బట్టి శాస్త్రీయంగా ఉపయోగించాలి. భూగ్రహాన్ని నివాసయోగ్య ఆవాస స్థలంగా మలుచుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించు కోవడానికి విశ్వ మానవాళి తమ జీవనశైలిలో స్వల్ప మార్పులు చేసుకుంటూ, ధరిణిని భూమాతగా భావించి, భూమిని స్వర్గంగా మార్చుకుందాం. విశ్వాన్ని సురక్షిత నివాస గృహంగా తీర్చి దిద్దుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

తెలంగాణ జాగృతి ఖతర్ బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ , సెప్టెంబర్ 20: తెలంగాణ జాగృతి ఖతర్ బతుకమ్మ పోస్టర్‌ను టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఖతర్‌లో మహా బతుకమ్మ వేడుకలను అక్టోబర్ 8న నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగృతి ఖతర్ అధ్యక్షుడు నందిని అబ్బగౌని తెలిపారు. దోహాలోని ఐసీసీ అశోక హాల్‌లో సాయంత్రం 5 గంటల నుంచి ఈ వేడుకలు జరగనున్నాయి. కరోనా నిబంధనల మేరకు బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తామన్నారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఏ గడ్డపై ఉన్నా, ఎన్ని ఇబ్బందులెదురైనా స్వీయ సంస్కృతిపై మక్కువతో, మాతృభూమిపై మమకారంతో మన సంస్కృతిని, పండుగలను జరుపుకుంటున్న ప్రవాస తెలంగాణ వాసుల కృషిని ఆమె కొనియాడారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జాగృతి ఖతర్ కార్యవర్గ సభ్యులు స్వప్నా కేశా, శ్రీధర్ అబ్బగౌని, అభిలాష్ బండి తదితరులు పాల్గొన్నారు.

ఐదేండ్లలో టోల్ ఫీజు రూ.1.40 లక్షల కోట్లు.. గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఎక్స్‌ప్రెస్ వే ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే అని కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. దీని నిర్మాణం పూర్తయి, 2023లో వినియోగంలోకి రానుందని. ప్రతి నెలా రూ.1000-1500 కోట్ల ఆదాయం తెచ్చి పెడుతుందన్నారు. ఢిల్లీ- ముంబై మధ్య ప్రయాణానికి 24-26 గంటలు పడితే, ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో 12-13 గంటలకు తగ్గి వస్తుందని చెప్పారు.

దేశవ్యాప్తంగా రోడ్లు, రహదారులపై మౌలిక వసతుల కల్పనతో వచ్చే ఐదేండ్లలో టోల్‌గేట్ల ద్వారా జాతీయ రహదారుల సంస్థ (ఎన్హెచ్ఏఐ)కి రూ.1.40 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని నితిన్ గడ్కరీ అన్నారు. ఇప్పుడు రూ.40 వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం జనరేట్ చేయడంలో జాతీయ రహదారుల సంస్థ గోల్డ్ మైన్ వంటిది కానుందన్నారు.

ఎన్హెచ్ఏఐ రూ.3.07 లక్షల కోట్ల రుణాల ఊబిలో ఉందని వస్తున్న ఆరోపణలను కొట్టి పారేశారు. 2017 మార్చితో పోలిస్తే ఇది నాలుగింతలు ఎక్కువ. ఎన్హెచ్ఏఐకి ఏఏఏ రేటింగ్ ఉందని, దాని అన్ని ప్రాజెక్టులు నిర్మాణాత్మకమేనని స్పష్టం చేశారు.

ఆదర్శప్రాయుడు చేకూరి కాశయ్య : మంత్రి పువ్వాడ

ఖమ్మం, సెప్టెంబర్ 20: ఆదర్శప్రాయుడు మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ చేకూరి కాశయ్య అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాశయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కాశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

ఖమ్మం జిల్లాలో ఎంతో మందికి రాజకీయ పాఠాలు నేర్పిన ఘనత కాశయ్యదన్నారు. ఆయన జీవితం భావితరాలకూ ఆదర్శమన్నారు. అనంతరం కాశయ్య జీవితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు వేజళ్ల సురేశ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మిర్యాలగూడెం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

దళిత బాంధవుడు సీఎం కేసీఆర్ : చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు, సెప్టెంబర్ 20: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయసాధనను నెరవేరుస్తూ సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన వెదిర గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ఏర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎల్లాపుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేంకటేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు.

ఇందులో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనావిధానంతోనే నేడు బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకొచ్చి దళిత బాంధవుడయ్యాడని కొనియాడారు.

కార్యక్రమంలో సర్పంచ్ తీగల సంగీత, జడ్పీ కో-ఆప్షన్ శుక్రొద్దీన్, ఎంపీడీవో మల్లోత్తా, చొప్పదండి ఏఎంసీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ కరుణాకర్, ఎంపీటీసీ తొరికొండ అనిల్‌కుమార్, వార్డు సభ్యులు, డీసీసీ ఉపాధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, ఆర్బీఎస్ గ్రామ కో-ఆర్డినేటర్ లచ్చిరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు కలిగేటి లక్ష్మణ్, నాగుల రాజశేఖర్‌గౌడ్, అన్నపూర్ణాలచ్చిరెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుమ్మరి రాము, శనిగరపు అనిల్, అర్జున్, అంజన్‌కుమార్, జూపాక మునీందర్ పాల్గొన్నారు

యువతకు ఆకర్షణీయమైన, ఉపాధికల్పన అవకాశంగా క్రీడలను ప్రోత్సహించాలి: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:దేశంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు అనువైన వాతావరణాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. టోక్యో ఒలింపిక్స్, పారాలింపిక్స్ లో భారతీయ క్రీడాకారులు చూపిన సత్తా కారణంగా దేశంలో యువతకు క్రీడలపై ఆసక్తి మరింత పెరిగిందన్నారు.

హరియాణాలోని గురుగ్రామ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడల్లో హర్యానా నుంచి పాల్గొన్న క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి, క్రీడాకారులందరినీ పేరుపేరునా అభినందించారు. కరోనా మహమ్మారితో ఒలింపిక్స్ కు ముందు శిక్షణ విషయంలోనూ ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ క్రీడాకారులు సత్తాచాటడం, గతంలో కంటే ఎక్కువ పతకాలను సాధించడం సాధారణ విషయం కాదన్నారు. భారత క్రీడాకారులు టోక్యో వేదికగా చూపించిన క్రీడా ప్రతిభ యావద్భారతానికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

దేశంలో క్రీడలను మరింతగా ప్రోత్సహించటంతో పాటు, మౌలికవసతుల అభివృద్ధి మీద దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముందన్న ఉపరాష్ట్రపతి, క్షేత్రస్థాయిలోనూ కనీస వసతులతో మొదలు పెట్టి పట్టణాలు, నగరాల వరకు వసతులను మరింతగా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. దీంతోపాటుగా క్రీడల్లో రాణిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయనే విషయంలో యువతకు భరోసా కల్పించగలిగితే.. రానున్న రోజుల్లో అంతర్జాతీయ క్రీడా యవనికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించేందుకు మార్గం సుగమం అవుతుందని ఉపరాష్ట్రపతి సూచించారు.

పారాలింపియన్లు చూపించిన ప్రతిభ అద్భుతమని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి, దివ్యాంగులకు కూడా సరైన అవకాశాలు కల్పిస్తే చక్కటి ఫలితాలు సాధిస్తారని నిరూపించారన్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రైవేటు, కార్పొరేట్ రంగం కూడా తోడ్పాటునందించి, భారతీయ యువతలోని నైపుణ్యాన్ని గుర్తించి దానికి సానబెట్టగలిగితే మరిన్ని అద్భుతాలు సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందని.. ఆరోగ్యకర పోటీతత్వం అలవడుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. అసంక్రమిత వ్యాధులు పెరిగేందుకు కారణం కూడా సరైన వ్యాయామం లేకపోవడమేనంటూ వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో హరియాణా ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్, ఆ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీ సందీప్ సింగ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, క్రీడాశాఖ కార్యదర్శి శ్రీ ఏకే సింగ్, టోక్యో ఒలింపిక్స్, పారాలింపిక్స్ లో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు, గురుగ్రామ్‌లో జరిగిన మరో కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు, రైతునాయకుడు, సామాజికవేత్త దివంగత శ్రీ ఛోటు రామ్ గారి వ్యవసాయ ఆర్థిక విధానాలు, రాజకీయ నిర్ణయాలు, స్వాతంత్రోద్యమంలో వారి పాత్ర తదితర అంశాలతో రూపొందించిన సంకలనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వగలమన్నారు.

కరోనా సమయంలో రైతులు రికార్డు స్థాయిలో ఉత్పాదకత పెంచడం అభినందించదగిన పరిణామం అన్న ఉపరాష్ట్రపతి, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

స్వాతంత్రోద్యమంలో తదనంతరం, దేశంలో వ్యవసాయ రంగంలో మరీ ముఖ్యంగా హరియాణా, పంజాబ్ ప్రాంతాల్లో తీసుకొచ్చిన మార్పులు, సామాజిక సేవ తదితర అంశాలను నేటి సమాజానికి తెలియజేసేందుకు హరియాణా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను అభినందించారు.

టీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బాజిరెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 20:టీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్‌కి ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు మరోసారి రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత కల్పించిన సీఎం కేసీఆర్‌కు జిల్లా ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్టీసీ మరింత చేరువ కావాలని, ప్రగతిపథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సురేశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, గణేశ్ గుప్తా తదితరులు హాజరయ్యారు. కాగా , తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీకి రెండో చైర్మన్‌గా బాజిరెడ్డి గోవర్ధన్ నిలిచారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించబోమని ఎఫ్‌సీఐ చెబుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు.

ఆదివారం ఆయన కరీంనగర్ మండలంలోని తాహెర్ కొండాపూర్ గ్రామంలోని పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి స్థానిక రైతులతో సమావేశమై మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పండిన పంటలను సేకరించడం, నిల్వ చేయడం, మార్కెటింగ్, ఎగుమతి చేయడం కేంద్ర ప్రభుత్వ భాధ్యతని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు నాణ్యమైన కరెంట్, నీరు, పెట్టుబడి సాయం ఇతర మౌలిక వసతులను రైతులకు కల్పించే అధికారం మాత్రమే ఉన్నదన్నారు.

సీఎం కేసీఆర్ కృషితో గ్రామాల్లో సమృద్ధిగా నీరు, ఉచిత కరెంటు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఉప్పు బియ్యం నిల్వల సాకుతో మన్న రైతాంగానికి నష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండడంతో రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలైన నూనె గింజలు, ఆయిల్‌పామ్, వేరుశనగ, పొద్దుతిరుగుడు, పత్తి, కంది పంటలను సాగు చేయాలన్నారు.

ఫిబ్రవరి 2 నుంచి రామానుజాచార్యుల సహస్రాబ్ది ఉత్సవాలు : చినజీయ స్వామి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:వచ్చే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సమతామూర్తి పేరిట భగవత్ రామానుజాచార్యుల సహస్రాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు త్రిదండి చినజీయర్ స్వామి తెలిపారు. సోమవారం ఆయన ముచ్చింతల్‌లోని మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇవాళ్టి నుంచి ఆశ్రయంలో చాతుర్మాస దీక్ష ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 1017లో రామానుజాచార్యులు అవతరించి 121 ఏళ్లపాటు భూమిపై ఉన్నారు. ఆయన సమతాస్ఫూర్తిని ఎంతో మంది మేధావులు అంగీకరించారు. చిన్న వయసులోనే ఆయనలో అద్భుత ప్రతిభాపాటవాలు ఉండేవన్నారు.

రామానుజాచార్యులు కేవలం పండితులే కాదు.. అద్భుతమైన ప్రజ్ఞాశాలి అని, సమతా సిద్ధాంతాన్ని లోకానికి చాటిన మహనీయులన్నారు. రామానుజుల సమతా స్ఫూర్తిని నేటి సమాజాన్ని అవసరమని, ఈ మేరకు శ్రీరామనగరంలో రామానుజుల భారీ విగ్రహాన్ని నిర్మించినట్లు చెప్పారు. సహస్రాబ్ది వేడుకల్లో రామానుజుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పంచలోహ విగ్రహం నిర్మాణమని, విగ్రహ నిర్మాణానికి రూ.1200కోట్లకుపైగా ఖర్చయిందని చెప్పారు. 120 కిలోల బంగారంతో నిత్యారాధన విగ్రహం ఏర్పాటు చేశామని వివరించారు.

బెస్ట్ అథ్లెట్ బైన్స్

హనుమకొండ, సెప్టెంబర్ 20:: ఐదు రోజులుగా క్రీడాభిమానులను అలరించిన జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) సహకారంతో ఓరుగల్లు వేదికగా జరిగిన ఈ మెగా టోర్నీలో.. రైల్వేస్ 253.5 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పురుషుల విభాగంలో ప్రవీణ్ చిత్రవేల్, మహిళల ఈవెంట్‌లో హర్మిలన్ కౌర్ బైన్స్ ఉత్తమ అథ్లెట్ ట్రోఫీలు చేజిక్కించుకున్నారు. ఆదివారం పోటీల చివరి రోజు జరిగిన పురుషుల 10 వేల మీటర్ల రేస్‌లో సర్వీసెస్‌కు చెందిన కార్తీక్ కుమార్ (29 నిమిషాల 42.63 సెకన్లు) స్వర్ణం సాధించగా.. ధర్మేందర్, మనోజ్ కుమార్ వరుసగా ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. మొత్తం 23 జట్లు పాల్గొన్న ఈ మెగాటోర్నీలో 18 జట్లు పతకాల పట్టికలో చోటు దక్కించుకోగా.. 36 మెడల్స్ (13 స్వర్ణాలు, 10 రజతాలు, 13 కాంస్యాలు)తో రైల్వేస్ టాప్‌లో నిలిచింది. ఏడు స్వర్ణాలు సహా 16 మెడల్స్ సాధించిన తమిళనాడు రెండో స్థానం దక్కించుకుంటే.. ఏకైక కాంస్యం దక్కించుకున్న తెలంగాణ 17వ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం జరిగిన ముగింపు వేడుకల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

వరంగల్‌లో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి 50 ఎకరాల స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 60వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలు వరంగల్ ప్రతిష్టను పెంచాయన్నారు. మరో ముఖ్య అతిథి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వరంగల్‌ను క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో కృషి చేయనున్నట్లు తెలిపారు.

అభినవపూలే సీఎం కేసీఆర్ : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20: సీఎం కేసీఆర్ అభినవ పూలేను తలపిస్తున్నాడన్నాడని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలలో గౌడ కులస్తులకు 15%, ఎస్సీలకు 10%,ఎస్టీ లకు 5% రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్‌ను మహబూబ్ నగర్ క్యాంప్ కార్యాలయంలో గౌడ సంఘాలు, ఎస్సీ, ఎస్టీలు సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..కులవృత్తులకు పూర్వవైభవం తీసుకరావడం ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమన్నారు. కులవృత్తులకు అండగా నిలిచి ఆర్థిక వ్యవస్థ మెరుగుపరుచడంలో కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు బహుజనులు అండగా ఉంటారన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎంపీ బీబీ పాటిల్

సంగారెడ్డి, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్యరావు అన్నారు. సోమవారం జహీరాబాద్ మండలం మల్చల్మ గ్రామంలోని ఈరన్న చెరువులో చేప పిల్లని వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కులవృత్తులకు పూర్వ వైభవం కల్పించేనీదుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడానికే ప్రభుత్వం సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా 2014 నుంచి ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుందన్నారు. దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి..!

– జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి) సోమవారం వివిధ సమస్యలతో జిల్లా కలెక్టరేటుకు వచ్చిన ప్రజల నుండి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజార్షీ షా తో కలసి అర్జీలను స్వీకరించారు.

అర్జీదారుల సమస్యలను సావధానంగా విని విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

పలువురు ధరణి భూసమస్యలు, పెన్షన్లు, రైతు బీమా, ఉద్యోగాలు కల్పించాలని, ఆర్థిక సహాయం కోరుతూ అర్జీలను అందజేశారు. ఎవరు కార్యాలయాల చుట్టూ తిరగవద్దని, విజ్ఞప్తులను పరిశీలించి ఆయా శాఖల అధికారులు వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వివిధ సమస్యలపై సుమారు 53 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలోని "వరము" రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ సంఘంగా నిలపాలి.

–జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి): సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వరం ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు సంవత్సరాల క్రితం రాయికోడ్,వట్ పల్లి, మునిపల్లి మండలాల రైతులతో రైతు ఉత్పత్తి దారుల సంఘం "వరం" పేరుతో ఏర్పడిందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఉత్పత్తులను తామే నేరుగా అమ్ముకోవడానికి ప్రజలు ఎక్కువగా రద్దీగా ఉండే ప్రాంతాలలో స్టాల్స్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

రైతు పండించిన పంటలు మధ్య దళారులు చేతుల్లో కి వెళ్లి సరైన ధర రావడంలేదని ,వారు లాభాలు గడిస్తున్న రైతులకు నామమాత్రంగా పెట్టుబడి మాత్రమే లభిస్తుందన్నారు.

రైతులే ప్రత్యక్షంగా కొనుగోలు దారుల సంఘం ఏర్పాటు చేసుకుని, ఇలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కలెక్టరేట్లో ఏర్పాటు చేశారని త్వరలో ఈ విక్రయ కేంద్రాలను హైదరాబాదు లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడ జనసమ్మర్దం ఉంటుందో అక్కడ విక్రయ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ గా ప్రత్యేక అనుమతులు జారీ చేస్తామని తెలిపారు.

సంఘం బాగా లాభాలు ఘడిస్తే సంఘం లోని ప్రతి సభ్యుడు లబ్ధి పొందుతాడన్నారు. వరం వినూత్న పోకడలతో ముందుకు వెళుతుందని, పత్తి సేకరణ, అమ్మకాలు, విత్తన కొనుగోలు దగ్గర నుండి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా ఉంటుందన్నారు.

రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం " వరం "కు రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు హరీష్ రావు కందిపప్పు మిల్లు మంజూరు చేశారని, మిల్లు ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని కేటాయించామన్నారు. త్వరలోనే పప్పు మిల్లును ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అట్టి మిల్లు ద్వారా వారే పప్పును తయారుచేసి నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే వరం ఒక ప్రత్యేక వ్యవస్థగా రూపొందుతుందని ఆయన ఆకాంక్షించారు.

ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వరం ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ

వరము సంస్థ ద్వారా రైతులకు అతి తక్కువ ధరకే అన్ని రకాల విత్తనాలను,మందు సంచులను,కాలానికి అనుగుణంగా తాటిపత్రిలు,మరియు పండించిన పంట ను మద్దతు ధరకు అమ్ముకునే విధంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

10 క్వింటాళ్ల పప్పు చేసి కేజీ పప్పు ను 99 రూపాయలకు విక్రయించడానికి సంఘం నిర్ణయించిందన్నారు.

అనంతరం మొదటి కొనుగోలుదారు గా జిల్లా కలెక్టర్ వారి ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అనంతరం కలెక్టర్ వీరారెడ్డి కొనుగోలు చేశారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జె.డి నర్సింహరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి హరిత ,చైర్మన్ వీరా రెడ్డి ,ప్రధాన బోర్డ్ సభ్యులు ఆనంద్, నరేష్ , డి ఏ ఓ కార్యాలయ సిబ్బంది,వరము సంస్థ సిబ్బంది, ఆత్మ సిబ్బంది శ్రీనివాస్,మాలతీ రమేష్ లు పాల్గొన్నారు..

క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు పెంచిన బీసీసీఐ

ముంబై,సెప్టెంబర్ 20: ప్రపంచంలోనే అత్యంత ధనికవంతమైన క్రికెట్ బోర్డు బీసీసీఐ దేశవాళీ క్రికెటర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. వాళ్ల మ్యాచ్ ఫీజులను పెంచుతున్నట్లు బోర్డు కార్యదర్శి జే షా సోమవారం ట్విటర్ ద్వారా ప్రకటించారు. సీనియర్ ప్లేయర్స్‌కు, అండర్ 23, అండర్ 19 క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను బోర్డు పెంచింది. 40 మ్యాచ్‌లకుపైగా ఆడిన అనుభవం ఉన్న సీనియర్ దేశవాళీ క్రికెటర్లకు ఇక నుంచి ఒక రోజు మ్యాచ్ ఫీజును రూ.60 వేలకు పెంచినట్లు జే షా చెప్పారు. ఇన్నాళ్లూ వీళ్లు రంజీ ట్రోఫీ లేదా విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొంటే మ్యాచ్ రోజు రూ.35 వేలు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు దానిని రూ.60 వేలకు పెంచారు.ఇక అండర్ 23 క్రికెటర్లకు రూ.25 వేలు, అండర్ 19 క్రికెటర్లకు రూ.20 వేలు మ్యాచ్ ఫీజుగా ఇవ్వనున్నట్లు జే షా వెల్లడించారు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో పాల్గొనే క్రికెటర్లకు రూ.17500 ఇస్తున్నారు. తుది జట్టులో ఆడే ప్లేయర్స్‌కు ఈ మ్యాచ్ ఫీజు ఇస్తుండగా.. రిజర్వ్ ప్లేయర్స్ ఇందులో సగం మొత్తం అందుకుంటారు. ఇక గతేడాది కరోనా కారణంగా దేశవాళీ సీజన్ నష్టపోవడంతో క్రికెటర్లకు పరిహారం ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. 2019-20 సీజన్ ఆడిన క్రికెటర్లకు 2020-21 సీజన్‌లో 50 శాతం అదనంగా చెల్లించనున్నట్లు కూడా జే షా ప్రకటించారు.

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'!

సెప్టెంబరు 20నుంచి 26 వరకూ నిర్వహణ

ఆత్మనిర్భర భారత్.కు ప్రాధాన్యంతో 'వాణిజ్య సప్తాహ్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:ప్రగతి కాముక స్వతంత్ర భారతదేశం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశ వైభవోపేత చరిత్రను స్మరించుకుంటూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వచ్చే వారమంతా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతోంది. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'వాణిజ్య సప్తాహ్' పేరిట వాణిజ్య వారోత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. 2021 సెప్టెంబరు 20నుంచి 26వ తేదీవరకూ వాణిజ్య వారోత్సవం చేపడతారు. ఈ సందర్భంగా ఆత్మనిర్భర భారత్ పథకంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తూ, దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, హరిత, స్వచ్ఛ దేశంగా భారత్ సాధించిన ప్రగతిని, ప్రత్యేక ఆర్థిక మండలుల అభివృద్ధిని వివరిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనికి తోడుగా, 'వ్యవసాయ క్షేత్రాలనుంచి విదేశీ భూములకు' అన్న కార్యక్రమం పేరిట, సదస్సులను, ఎగుమతులను ప్రోత్సహించే సమ్మేళనాలను నిర్వహిస్తారు. దేశంలోని 739 జిల్లాలకు వర్తింపజేస్తూ, 'వాణిజ్య ఉత్సవ్' పేరిట మరో కార్యక్రమాన్ని కూడా వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది.

దేశంలోని ప్రతి జిల్లాను ఎగుమతికి కేంద్రంగా తీర్చిదిద్దాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురునుంచి ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని 'ఒక జిల్లా ఒక ఉత్పాదన(ఒ.డి.ఒ.పి.)' పథకాన్ని 2020 సెప్టెంబరులో ప్రారంభించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ఆదేశాలకు అనుగుణంగా ఒ.డి.ఒ.పి. పథకానికి శ్రీకారం చుట్టారు. ఒక జిల్లా సిసలైన సామర్థ్యాన్ని వెలికి తీసే ఉద్దేశంతో చేపట్టిన పరివర్తనా చర్యగా ఒ.డి.ఒ.పి. పథకాన్ని పరిగణిస్తున్నారు. సంబంధిత జిల్లా ఆర్థిక ప్రగతిని మరింత క్రియాశీలం చేయడం, ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం, గ్రామీణ ప్రజల్లో ఔత్సాహిక పారిశ్రామిక, వాణిజ్య తత్వాన్ని అలవర్చడం, చివరకు ఆత్మనిర్భర భారత్ పథకం లక్ష్యాలను సాధించడం వంటి లక్ష్యాలతో ఒ.డి.ఒ.పి. పథకాన్ని రూపొందించారు.

2021 సెప్టెంబరు 24నుంచి 26వరకూ జరగనున్న వాణిజ్య ఉత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 700కు పైగా జిల్లాల్లో ఎగుమతి ప్రాధాన్యంతో సమ్మేళనాలు, సమావేశాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా వంద జిల్లాల్లో విదేశ వాణిజ్య వ్యవహారాల డైరెక్టరేట్ జనరల్ ఆధ్వర్యంలో మరింతగా భారీ స్థాయిలో కార్యక్రమాలు కూడా చేపడతారు. ఎగుమతి, మార్కెట్ అభివృద్ధి వ్యవహారాల మద్దతు సంస్థ, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కార్యక్రమాల నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తాయి. ఈ సదస్సుల నిర్వహణలో సంబంధిత జిల్లాల కమిషనర్లు, కలెక్టర్ల సారథ్యంలోని జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీలు (డి.ఇ.పి.సి.లు) కూడా కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తాయి. వాణిజ్య ఉత్సవాల్లో భాగంగా, ఆయా జిల్లాల్లోని స్థానిక ఎగుమతిదార్లు, ఔత్సాహిక పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకోసం రెండు-మూడు గంటల వ్యవధితో సదస్సులను కూడా నిర్వహిస్తారు. లీడ్ బ్యాంకు, స్థానిక ఎగుమతి మండలులు, సంఘాలు, ఎగుమతి ప్రోత్సాహ మండలులు (ఇ.పి.సి.లు) తదితర భాగస్వామ్య సంస్థల ప్రమేయంతో విదేశీ వాణిజ్య అంశాలపై ఈ సదస్సులను నిర్వహిస్తారు.

వీటికి తోడుగా, దేశంలోని ఐదు ప్రాంతాల్లో ఐదు జాతీయ స్థాయి సదస్సులను, ప్రదర్శనలను, ఎగ్జిబిషన్లను భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ (ఐ.ఐ.ఎఫ్.టి.) నిర్వహిస్తుంది. ?ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాల్లో ఈ ఐదు సదస్సులను, ప్రదర్శనలను నిర్వహిస్తారు.

"స్వాతంత్ర్య, ఎగుమతికి ప్రోత్సాహం/దిగుమతికి ప్రత్యామ్నాయం ? ఆత్మనిర్భర భారత్" అన్న ఇతివృత్తంతో ఈ సదస్సులను చేపడతారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎం.ఎస్.ఎం.ఇ.లు), ప్రభుత్వ ఇ-మార్కెట్ వేదికలు, ఇ.పి.సి.లను కార్యోన్ముఖం చేసే ప్రక్రియను కూడా ఈ సదస్సుల సందర్భంగా పూర్తి చేస్తారు.

ఇక 'వాణిజ్య సప్తాహ్' పేరిట నిర్వహించే వాణిజ్య వారోత్సవంలో భాగంగా, 35 ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలను, ఎగ్జిబిషన్లను సెప్టెంబరు 21, 22 తేదీల్లో నిర్వహిస్తారు. 14 ఎగుమతి ప్రోత్సాహ కమిటీల (ఇ.పి.సి.ల) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలోనూ ఒక కార్యక్రమం, ప్రదర్శన నిర్వహించి తీరేలా చర్యలు తీసుకుంటారు. భారతదేశాన్ని ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా ఈ కార్యక్రమాల్లో ప్రతిఫలింపజేస్తారు. ఎగుమతి ప్రోత్సాహక చర్యలను ప్రజోద్యమం మార్చేందుకు వీలుగా, ఈ కార్యక్రమాలకోసం స్థానిక ఎగుమతిదార్లను, తయారీ దార్లను, పారిశ్రామిక యూనిట్లను ఇ.పి.సి.లు సమీకరిస్తాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే వారిని ఉద్దేశించి పలువురు కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు ప్రసంగిస్తారు. కార్యక్రమాల్లో పాల్గొనే వారితో, భాగస్వామ్య వర్గాల ప్రతినిధులతో వివిధ అంశాలపై వారు అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకుంటారు.

ఇదిలా ఉండగా,..పారిశ్రామిక ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య శాఖ (డి.పి.ఐ.ఐ.టి.) కూడా రెండు పెద్ద కార్యక్రమాలను చేపట్టబోతోంది. జాతీయ సింగిల్ విండోవ్యవస్థ, పారిశ్రామిక పార్క్ రేటింగ్ వ్యవస్థ అనే రెండు కార్యక్రమాలను డి.పి.ఐ.ఐ.టి. చేపట్టబోతోంది. అలాగే, భారతదేశంలో తమ వాణిజ్యం ప్రారంభించేందుకు వీలుగా, పెట్టుబడి దారులు తాము ప్రారంబించబోయే సంస్థను గుర్తించేందుకు, అందుకు ఆమోదం మంజూరు చేసేందుకు వీలుగా ఒక డిజిటల్ వేదికను కూడా ఏర్పాటు చేస్తారు. వాణిజ్యం ప్రారంభానికి తగిన సదుపాయాలు కల్పించడం, మద్దతు ఇవ్వడం, పెట్టుబడులకు ముందు సలహా సంప్రదింపులు అందించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో అనుమతులు, ల్యాండ్ బ్యాంకుల సమాచారం వంటివి కూడా ఈ వేదిక ద్వారా కల్పిస్తారు. పెట్టుబడి దార్లు, విధాన నిర్ణయ కర్తలకోసం బాగా పనిచేసే పారిశ్రామిక పార్కులను గుర్తించడం తదితర వ్యవహారాల విషయంలో పారిశ్రామిక పార్క్ రేటింగ్ వ్యవస్థ (ఐ.పి.ఆర్.ఎస్.) తగిన సేవలందిస్తుంది. ఇక పారిశ్రామిక పార్క్ రేటింగ్ వ్యవస్థ రెండవ దశ (2.0)లో మరిన్ని ఎక్కువ అంశాలకు సేవలను విస్తరింజేస్తారు. ఈ దశలో ప్రైవేటు పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక వాణిజ్య మండలులతో సహా, మొత్తం పారిశ్రామిక పార్కుల విలువలను మధింపు చేస్తారు. ఇందుకోసం గుణాత్మక సూచికలను వినియోగిస్తారు. అంతర్గత మౌలిక సదుపాయాలు, వినియోగ అంశాలు, బాహ్య మౌలిక సదుపాయాలు, అనుసంధానం, వాణిజ్య మద్దతు వ్యవస్థలు, పర్యావరణ, నిర్వహణా వ్యవస్థ తదితర అంశాల పరిధిలో ఈ అంచనాను చేపడతారు.

దేశపు ఉత్పాదనా సామర్థ్యాన్నిగరిష్ట స్థాయిలో వినియోగించుకుని, స్థూల స్వదేశీ ఉత్పాదనను (జి.డి.పి.ని) పెంచుకునేందుకు జరిపే ప్రయత్నాలకు అనుబంధంగా పలు కార్యక్రమాలను చేపట్టేందుకు పారిశ్రామిక కారిడార్ల పథకాన్ని రూపొందించారు. తమతమ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్ల పథకం సాధించిన ప్రగతిపై మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రానికి చెందిన ధోలేరా ఇండస్ట్రియల్ సిటీ డెవలప్మెంట్ లిమిటెడ్ (డి.ఐ.సి.డి.ఎల్.), మహారాష్ట్రకు చెందిన ఔరంగాబాద్ ఇండస్ట్రియల్ టౌన్ షిప్ లిమిటెడ్ (ఎ.ఐ.టి.ఎల్.), ఉత్తరప్రదేశ్ కు చెందిన డి.ఎం.ఐ.సి. ఇండిగ్రేటెడ్ టౌన్.షిప్ గ్రేటర్ నోయిడా లిమిటెడ్ (ఐ.ఐ.టి.జి.ఎన్.ఎల్.), కర్ణాటక రాష్ట్రానికి చెందిన సి.బి.ఐ.సి. తుమకూరు ఇండస్ట్రియల్ టౌన్ షిప్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్మెంట్ లిమిటెడ్, మధ్యప్రదేశ్ కు చెందిన డి.ఎం.ఐ.సి. విక్రమ్ ఉద్యోగ్ పురి లిమిటెడ్ (వి.యు.ఎల్.) ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

వీటికి తోడుగా, డి.పి.ఐ.ఐ.టి. కూడా జాతీయ స్థాయి చర్చాగోష్ఠులు నిర్వహిస్తుంది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఈ చర్చాగోష్ఠుల్లో పాలుపంచుకుంటాయి. అన్ని విధాన, నిబంధనలు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఎ.ఎం.లు తదితర ప్రక్రియల్లో నియంత్రణలతో కూడిన భారాన్ని తొలగించడం, ఎలాంటి మెరుగుదల సాధించకుండానే జరిగే కాలహరణాన్ని, వ్యయాన్ని తగ్గించడం, కొన్ని సాంకేతికేతర అంశాలకు సంబంధించి పదేపదే తారసపడే ఒకే తరహా నిబంధనలను రద్దు చేయడం, సవరించడం, ఇతర నిబంధనల్లో కలిపేయడం, సంబంధిత నిబంధనలను అవసరమైన చోట్ల సడలించడం, ప్రజా ప్రయోజనాలకు హానికరంగా పరిణమించే తీవ్రమైన అక్రమాలు, నేరాలకు సంబంధించి కఠిన నిబంధనలను ఎప్పటిలా పునరుద్ధరించడం వంటి చర్యలను డి.పి.ఐ.ఐ.టి. తీసుకుంటుంది.

ఇందుకు సంబంధించి,.. జాతీయ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్.ఐ.సి.డి.సి.) కూడా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుంది. కోల్కతా, చెన్నై, ముంబై ఓడరేవుల్లో ఈ కార్యక్రమాలు చేపడతారు. దేశ వ్యాప్తంగా ఎగుమతి, దిగుమతి కంటెయినర్ విజిబిలిటీ సేవల ద్వారా, లాజిస్టిక్ డాటా బ్యాంక్ ద్వారా జరిగే ప్రగతిని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రధానంగా వివరిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్పెషల్ పర్పస్ వెహికల్ తీసుకున్న చర్యలను, రాజస్థాన్ రాష్ట్రంలోని నీమ్రానాలో 6 మెగావాట్ల సౌరశక్తి విద్యుత్ ప్రాజెక్టు సాధించిన ప్రగతిని ప్రధానంగా పేర్కొంటూ మరో కార్యక్రమాన్ని కూడా ఎన్.ఐ.సి.డి.సి. నిర్వహిస్తుంది.

ఇక, ఇన్వెస్ట్ ఇండియా పేరిట ఈ శాన్య ప్రాంతంలో పెట్టుబడిదార్లతో ఒక శిఖరాగ్ర సదస్సును, లేదా చర్చా వేదికను వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులను నిర్వహించే సంస్థలతో కూడా ఒక సమావేశాన్ని నిర్వహిస్తారు.

దేశంలోని తేయాకు, కాఫీ తోటలు, వివిధ తోటపనుల్లో పనిచేసే దాదాపు పది లక్షలమంది కార్మికులు కూడా ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పలు ప్లాంటేషన్ ప్రాంతాల్లో ఈ నెల 26న ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. 'వ్యవసాయ క్షేత్రాలనుంచి విదేశీ భూములకు' అన్న ఇతివృత్తంతో వాణిజ్య శాఖలోని ప్లాంటేషన్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించిన అభివృద్ధి మంత్రానికి అనుగుణంగా, దేశంలోని 250కిపైగా ప్రత్యేక ఆర్థిక మండలులు (ఎస్.ఇ.జెడ్.లు) స్వచ్ఛతా ఉద్యమాన్ని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతాయి. 'హరిత, స్వచ్ఛ ఆర్థిక మండలుల'పై దృష్టిని కేంద్రీకరిస్తూ, తమతమ పరిధిలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఎస్.ఇ.జెడ్.లు ఈ నెల 23న చేపడతాయి.

వాణిజ్య సప్తాహ్ పేరిట నిర్వహించే వాణిజ్య వారోత్సవంలో భాగంగా "స్వాతంత్ర్యం, ఎగుమతికి ప్రోత్సాహం/దిగుమతికి ప్రత్యామ్నాయం- ఆత్మ నిర్భర భారత్.." అనే అంశంపై జాతీయ స్థాయి వ్యాస రచనా పోటీని 2021, సెప్టెంబరు 20న నిర్వహించనున్నారు. ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐ.బి.ఇ.ఎఫ్.) ఆధ్వర్యంలో పోటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, ఈశాన్యం వంటి ఐదు ప్రాంతాలకోసం ప్రత్యేకంగా, విడివిడిగా ఈ పోటీలు నిర్వహిస్తారు. ప్రతి ప్రాంతానికీ సంబంధించి అగ్రశ్రేణి సాధించిన ఐదు ఎంట్రీలకు బహుమతులను ప్రదానం చేస్తారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరిట వేడుకలు ఈ మంత్రిత్వ శాఖ, విభాగం ఆధ్వర్యంలో ప్రతి రాష్ట్రంలోనూ పలు రకాలుగా జరుగుతున్నాయి. భారతదేశపు సామాజిక, సాంస్కృతిక, ఆర్థికపరమైన గుర్తింపు, విభిన్నత్వం గురించి వివరిస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 'ఆజాదీ అమృత్ మహోత్సవ్' వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2021 మార్చి నెల 12న అహ్మదాబాద్.లో ప్రారంభించారు. 2022 ఆగస్టు 15వ తేదీలోగా 75 వారాలపాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలు 2023 ఆగస్టు 15వరకూ జరుగుతాయి. అభివృద్ధి పథంలో, దేశ ప్రజలకు ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ఉత్సవాలను 75 వారాలపాటు జరుపుకోవాలంటూ ప్రధానమంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అన్ని శ్రేణుల్లో మహిళా సాధికారతకు కట్టుబడిన బిఆర్ఒ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా - మహిళలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ భగవంతుడు తన దైవిక గుణాలు, సత్కార్యాలు, శాంతి, సౌభ్రాత్రం ఉంటాయి, అది జరగకపోతే, అన్ని చర్యలూ నిష్ఫలమవుతాయన్న శ్లోక సారాంశానికి అనుగుణంగా భారత సమాజంలో మహిళల పట్ల ఎంతో గౌరవం ఉంది.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా జరుపుకుంటున్న ఆజాదీ కా అమృత మహోత్సవతో పాటుగా మహిళా సాధికారత దిశగా మన దేశ కృషిని కూడా వేడుక చేసుకుంటోంది.

నేడు మహిళలు దేశ నిర్మాణంలో తమ న్యాయమైన, సమాన స్థానాన్ని స్వకరించడమే కాక బలమైన జాతీయ స్వభావానికి ప్రతినిధులుగా ఉన్నారు.

సరిహద్దు రహదారుల సంస్థ (బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ - బిఆర్ఒ) గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద సంఖ్యలో మహిళలను ఆఫీసర్ల స్థాయి నుంచి కమర్షియల్ పైలెట్ లైసెన్స్ హోల్డర్లుగా నియమిస్తోంది. అధికారం, బాధ్యత, గౌరవం అన్న పరికరాలతో వారిని సాధికారం చేయడం ద్వారా దేశ నిర్మాణంలో చురుకైన భాగస్వాములు అవుతారని బిఆర్ఒ బలంగా విశ్వసిస్తోంది. ఈ విశ్వాసాన్ని ధృవీకరిస్తూ, సంస్థ మహిళలకు ఉన్నత నాయకత్వ స్థానాలను అప్పగించడాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో జిఆర్ఇఎఫ్ ఆఫీసర్ ఇఇ (సివిల్) వైఏశాలి ఎస్ హివాసే సవాళ్ళు, ప్రతికూలతలు నిండిన ప్రాంతమైన మునిసైరీ - బగ్గియార్- మిలాంను అనుసంధానం చేసే కీలకమైన భారత్ - చైనా రహదారి 83 రోడ్ కనస్ట్రక్షన్ కంపెనీ బాధ్యతలను ఏప్రిల్ 28, 2021న స్వీకరించారు. మహిళా అధికారి బాధ్యతలను తీసుకొని, తనకప్పగించిన పనులను అత్యంత శ్రద్ధతో నిర్వహిస్తున్నారు.

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలోని పీపల్‌కోటిలోని 75 ఆర్‌సిసికి ఆఫీసర్ కమాండింగ్ గా ప్రాజెక్టు శివాలిక్‌కు చెందిన మేజర్ అంజనా 30 ఆగస్టు 2021న బాధ్యతలు స్వకరించిన సందర్భంలో బిఆర్ఒ తిరిగి చరిత్రను సృష్టించింది. ఒక రోడ్డు నిర్మాణ కంపెనీకి అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తొలి భారతీయ సైనిక ఇంజనీర్ అధికారి ఆమె.

అంతేకాదు, కెప్టెన్ అంజనా కింద ఉన్న ముగ్గురు ప్లెటూన్ కమాండర్లు ఎఇఇ (సివిల్) భావనా జోషి, ఎఇఇ (సివిల్) విష్ణుమాయ కె మహిళా అధికారులు. వారు ముగ్గురూ కలిసి తొలి మహిళా ఆర్‌సిసిని సృష్టించారు. అలా మహిళా నాయకత్వంలో నాలుగు ఆర్‌సిసిలను ఈశాన్య ప్రాంతంలో రెండు, పశ్చిమ సెక్టర్లో రెండు చొప్పున ఏర్పాటు చేయాలని బార్డర్ రోడ్ ప్రయత్నం చేస్తోంది.

గత ఆరు దశాబ్దాలలో క్రమ పద్ధతిలో బిఆర్ఒ రహదారుల నిర్మాణంలో వివిధ బాధ్యతలను పాత్రలను నిర్వహించేందుకు మహిళల సంఖ్యను పెంచుతూ వచ్చింది. స్వతంత్రంగా పని చేపట్టేందుకు అవసరమైన అధికారాన్ని, బాధ్యతలను అప్పగించడం ద్వారా వారిని సాధికారం చేసే యత్నం జరుగుతోంది. తమతమ రంగాలలో నారీశక్తికి చిహ్నంగా ఈ మహిళలు నిలిచారు.

మహిళలు అన్ని రంగాలలో ప్రధాన పాత్రలను పోషిస్తుండగా, మహిళా సాధికారతకు బిఆర్ఒ చేపట్టిన బహుముఖ పద్ధతిలో వివిధ ఉద్యోగ పాత్రలు, ఉన్నత విద్యకు అవకాశాలు, అందుబాటులో సరైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, సాహసాలకు అవకాశాలు, క్రీడలు, సంపూర్ణ అభివృద్ధికి ప్రోత్సాహం ఉన్నాయి.

నిజమైన భావంలో మహిళా సాధికారత అన్నది వైఖరిలో మార్పులను పొందుపరచడం ద్వారా సాధించారు.

వారికి ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడమే కాక, సరైన గౌరవంతో, న్యాయంగా, సమానంగా చూడడం ద్వారా సాధించారు. వృత్తిపరమైన రంగంలోనే కాక సంక్షేమ చొరవలలో భాగంగా మహిళలకు తమ ఆర్థిక వ్యవహారాలను, పత్రాలను నిర్వహించే విద్యను అందిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో మహిళా సాధికారత కోసం నిబద్ధతతో కూడిన విద్యా కార్యక్రమాలను బిఆర్ఒ ప్రాజెక్టు ఉద్దేశ్యపూర్వకంగా ప్రచారాన్ని చేపట్టింది. ఆడపిల్లలకు సమాన అవకాశాలు అన్న దానిపై దృష్టి పెట్టడం అన్నది బిఆర్ఒకు కీల

దేశవ్యాప్తంగా వేగం పుంజుకున్న - అసంఘటిత కార్మికుల నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:ఈ-శ్రమ్ పోర్టల్ లో అసంఘటిత కార్మికుల నమోదును సులభతరం చేసే కార్యక్రమం ఆగస్టు 26వ తేదీన ప్రారంభమైన రోజు నుండి భారీగా ప్రాచుర్యం పొందింది. గత 24 రోజుల్లో, ఒక కోటి (లేదా 10 మిలియన్) కంటే ఎక్కువ మంది కార్మికులు ఈ పోర్టల్ లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ రోజు వరకు, 1,03,12,095 మంది కార్మికులు ఈ పోర్టల్ లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో దాదాపు 43 శాతం మంది లబ్ధిదారులు స్త్రీలు కాగా 57 శాతం మంది పురుషులు ఉన్నారు.

నిర్మాణం, దుస్తులు తయారీ, చేపల వేట, చిన్న పడవల నిర్మాణం, ప్లాట్‌ఫాం పనులు, వీధి విక్రయాలు, గృహ పని, రవాణా, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల వంటి, వివిధ రంగాలకు చెందిన అసంఘటిత కార్మికుల సమగ్ర సమాచారాన్ని ఒకచోట పొందుపరచాలనే ఉద్దేశ్యంతో మొట్ట మొదటి సారి చేపట్టిన ప్రక్రియలో భాగంగా రూపొందించిన ఈ-శ్రమ్ పోర్టల్ ను కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ మరియు సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తేలి ఆగస్టు 26వ తేదీన ప్రారంభించారు.

ఈ రంగాలకు చెందిన పనుల్లో అత్యధిక సంఖ్యలో వలస కార్మికులు నిమగ్నమై ఉన్నారు. 2019-20 ఆర్థిక సర్వే ప్రకారం, దేశంలో 38 కోట్ల మంది అసంఘటిత కార్మికులు (యు.డబ్ల్యూ) ఉన్నట్లు అంచనా వేయడం జరిగింది. వారందరినీ నమోదు చేయాలనే లక్ష్యంతో ఈ పోర్టల్ ను రూపొందించడం జరిగింది. ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకోవడం ద్వారా, ఈ వలస కార్మికులందరూ, ఇప్పుడు, వివిధ సామాజిక భద్రత మరియు ఉపాధి ఆధారిత పథకాల ప్రయోజనాలను పొందవచ్చు.

అసంఘటిత రంగ కార్మికుల జాతీయ స్థాయి సమాచారాన్ని రూపొందించడం కోసం ఇటీవల ప్రారంభించిన ఈ-శ్రమ్ పోర్టల్ యొక్క లక్షణాలు, ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం కోసం, అసంఘటిత కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులతో కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్; సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తెలీ; కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి; (కార్యదర్శి, ఎల్‌డఈ) శ్రీ అపూర్వ చంద్ర; చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) తో పాటు సి.ఎల్.సి. కి చెందిన ఇతర ప్రాంతీయ అధికారులు సంభాషిస్తున్నారు. అలాగే, ఈ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి, సి.ఎల్.సి.(సి), ఇటువంటి ఐదు సమావేశాలను నిర్వహించింది. ఇవన్నీ భారీ విజయాన్ని సాధించాయి.

2021 సెప్టెంబర్, 19వ తేదీన మణిపూర్, ఇంఫాల్ లోని నమోదు కేంద్రం లో అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేస్తూ, వారితో సంభాషిస్తున్న - కేంద్ర కార్మిక, ఉపాధి, పర్యావరణ శాఖల మంత్రి, శ్రీ భూపేందర్ యాదవ్

2021 సెప్టెంబర్ 18వ తేదీన మధ్యప్రదేశ్, జబల్‌పూర్‌లోని నమోదు కేంద్రం లో అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేస్తూ, వారితో సంభాషిస్తున్న - కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తెలీ.

తాజా గణాంకాల ప్రకారం, ఈ దిగువ గ్రాఫ్ లో సూచించిన విధంగా బీహార్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు అత్యధిక నమోదుతో ఈ కార్యక్రమం అమలులో ముందంజలో ఉన్నాయి. అయితే, ఈ గణాంకాలను చాలా జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నమోదైన కార్మికులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు.

కేరళ, గుజరాత్, ఉత్తరాఖండ్, మేఘాలయ, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, లడక్, జమ్మూ-కశ్మీర్, చండీగఢ్ వంటి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ కార్యక్రమం ఇంకా ఊపందుకోవలసిఉంది. అసంఘటిత రంగంలోని కార్మికులకు ఉద్దేశించిన కీలకమైన సంక్షేమ కార్యక్రమాలతో పాటు, ఉపాధి ఆధారిత పథకాల ప్రయోజనాలు పొందడానికి అవసరమైన వివిధ అర్హతలను అందిపుచ్చుకోవడానికి గల అవకాశాలను ఈ నమోదు సులభతరం చేస్తుంది.

భారతదేశంలో ఉపాధి కల్పన విషయంలో ప్రథమ స్థానంలో ఉన్న వ్యవసాయం మరియు నిర్మాణ రంగం నుండి అత్యధిక సంఖ్యలో కార్మికులు నమోదయ్యారు. వీరితో పాటు, ఇంటి పనులు చేసే కార్మికులు, దుస్తులు రంగ కార్మికులు, ఆటోమొబైల్, రవాణా రంగ కార్మికులు, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ కార్మికులు, క్యాపిటల్ గూడ్స్ కార్మికులు, విద్య, ఆరోగ్య సంరక్షణ, రిటైల్, పర్యాటక, ఆతిథ్యం, ఆహార పరిశ్రమ వంటి వివిధ రకాల వృత్తుల్లో పనిచేస్తున్న అనేక మంది ఈ పోర్టల్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

నమోదు చేసుకున్న మొత్తం కార్మికుల్లో, దాదాపు 48 శాతం మంది 25-40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో 40-50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు దాదాపు 21 శాతం మంది ఉన్నారు. 16-25 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు 19 శాతం మంది ఉండగా, 50 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల వారు 12 శాతం మంది ఉన్నారు.

పైన గ్రాఫ్ లో పేర్కొన్న దాన్ని బట్టి, తమకు అందుబాటులో ఉన్న సి.ఎస్.సి. ల ద్వారా గణనీయమైన సంఖ్యలో కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. కేరళ, గోవా వంటి కొన్ని రాష్ట్రాలతో పాటు ఈశాన్య భారతదేశంలో మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాలలో ఎక్కువ మంది కార్మికులు ఈ పోర్టల్ ద్వారా తమకు తాముగా నమోదు చేసుకున్న విషయం ఆసక్తికరంగా ఉంది. దాద్రా-నాగర్ హవేలీ, అండమాన్-నికోబార్, లడఖ్ వంటి చాలా కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇలా ఉండగా, తాజా సమాచారం ప్రకారం, దాదాపు 68 శాతం మంది కార్మికులు సి.ఎస్.సి. ల ద్వారా తమకు తాముగా నమోదయ్యారు. అందువల్ల, తక్కువ సౌలభ్యం ఉన్న ప్రాంతాల్లో సి.ఎస్.సి. సేవల విస్తరణ ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సమీపంలో ఉన్న సి.ఎస్.సి. లను సందర్శించి, ఈ పోర్టల్ ద్వారా తమను తాము నమోదు చేసుకుని, ఈ కార్యక్రమం యొక్క ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కార్మికులందరినీ కోరడం జరిగింది. ముఖ్యంగా వలస కార్మికులు దీని నుండి ఎంతో ప్రయోజనం పొందుతారు.కార్మికులు వ్యక్తిగతంగా ఆన్-లైన్ లో నమోదు చేసుకోడానికి, ఈ-శ్రమ్ మొబైల్ యాప్ లేదా వెబ్-సైట్ ను ఉపయోగించవచ్చు. వారు ఈ పోర్టల్ లో తమను తాము నమోదు చేసుకోవడానికి ఉమ్మడి సేవా కేంద్రాలు (సి.ఎస్.సి), రాష్ట్ర సేవా కేంద్రం, కార్మికుల సౌకర్య కేంద్రాలు, తపాలా శాఖకు చెందిన ఎంపిక చేసిన డిజిటల్ సేవా కేంద్రాల పోస్టాఫీసులను కూడా సందర్శించవచ్చు. ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకున్న తర్వాత, అసంఘటిత కార్మికులు డిజిటల్ ఈ-శ్రమ్ కార్డును స్వీకరిస్తారు. వారు తమ వ్యక్తిగత వివరాలను పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సవరించుకోవచ్చు. వారికి ఒక సార్వత్రిక ఖాతా సంఖ్య (ఈ-శ్రమ్ కార్డు తో) కేటాయిస్తారు. ఇది దేశవ్యాప్తంగా ఆమోదయోగ్యమైనదిగా ఉండటం వలన, ఇప్పుడు, వారు సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందడానికి వివిధ ప్రదేశాలలో నమోదు చేయవలసిన అవసరం ఉండదు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ఎవరైనా కార్మికుడు ప్రమాదానికి గురై, అతను లేదా ఆమె మరణం లేదా శాశ్వత వైకల్యం కలిగినట్లయితే, వారు రెండు లక్షల రూపాయల పరిహారానికీ, లేదా పాక్షిక వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయల పరిహారానికి అర్హులవుతారు.

నేడు స్థిరంగా బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:బంగారం, వెండి ధరలు ఇవాళ ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా స్థిరంగా ఉన్నాయి. ఢిల్లీ మార్కెట్‌లో ఇవాళ 10 గ్రాముల 24 క్యారట్ బంగారం ధర (ఉనీశ్రీట తీజీబివ బినీటజీఎ) రూ.14 పెరిగి రూ.45,080కు చేరింది. క్రితం ట్రేడ్‌లో తులం స్వచ్ఛమైన బంగారం ధర రూ.45,066గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్‌లు ఫ్లాట్‌గా ముగియడమే దేశీయంగా బంగారం ధరలు స్థిరంగా కొనసాగడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు.

ఇక వెండి ధరలు కూడా ఇవాళ స్థిరంగా ఉన్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర కేవలం రూ.98 పెరిగి రూ.58,890కి చేరింది. క్రితం ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.58,792 వద్ద ముగిసింది. మరోవైపు ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ ఇవాళ 34 పైసలు బలహీనపడి 73.82 లకు చేరింది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర ఇవాళ 1,753 అమెరికన్ డాలర్లు, ఔన్స్ వెండి 22.47 అమెరికన్ డాలర్‌లు పలికింది.

5 నుంచి 11 ఏళ్ల మధ్య చిన్నారులకు ఫైజర్ టీకా సురక్షితం

న్యూయార్క్, సెప్టెంబర్ 20:: అయిదేళ్ల నుంచి 11 ఏళ్ల మధ్య వయసు ఉన్న చిన్నారులకు తమ టీకా సురక్షితమని ఫైజర్ తెలిపింది క్లినికల్ ట్రయల్స్ ఫలితాల ద్వారా ఈ విషయాన్ని తేల్చారు. అయితే ఎమర్జెన్సీ వినియోగం కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు ఆ కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ఫైజర్-బయోఎన్‌టెక్ కోవిడ్ టీకా 5 నుంచి 11 ఏళ్ల మధ్య చిన్నారులకు సురక్షితంగా, ప్రభావవంతంగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. దానికి సంబంధించిన డేటాను ఆ కంపెనీ రిలీజ్ చేసింది. డెల్టా వేరియంట్‌ను కూడా స్టడీ చేశామని, పిల్లల్లో ఆ వేరియంట్ వల్ల ఉన్న భయాందోళనలకు ఫైజర్‌తో చెక్ పెట్టవచ్చు అని గుర్తించామని ఫైజర్ చైర్మెన్, సీఈవో ఆల్బర్ట్ బౌరులా తెలిపారు.

అమెరికాలో జూలై నుంచి పీడియాట్రిక్ కోవిడ్ కేసులు విపరీతంగా పెరిగాయి. సుమారు 240 శాతం కేసులు పెరిగినట్లు గుర్తించారు. దీంతో పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి అన్న నిర్ణయానికి వచ్చారు. అయితే ట్రయల్స్‌లో 5 నుంచి 11 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారిలో 2268 మందికి టీకాలు వేశారు. రెండో డోసుల రూపంలో ఈ ట్రయల్స్ నిర్వహించారు. సాధారణంగా 12 ఏళ్ల పైబడిన వారికి ఇచ్చే డోసేజ్ కన్నా తక్కువ మోతాదులో పిల్లలకు టీకాలు ఇచ్చారు. పిల్లల్లో ఫైజర్ టీకా యాంటీబాడీలను పెంచుతున్నట్లు గుర్తించామన్నారు.

ఫైజర్ కంపెనీ తమ డేటాను అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏతో షేర్ చేసుకోనున్నది. యురోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీతో పాటు ఇతర రెగ్యులేటర్లకు కూడా తమ డేటాను అందజేయనున్నది. అమెరికాలో 16 ఏళు దాటిన వారికి ఫైజర్ టీకాలు ఇస్తున్నారు. కొమిర్నాటీ పేరుతో ఆ టీకాలను మార్కెట్ చేస్తున్నారు. 12 నుంచి 15 ఏళ్ల వారిలో మాత్రం ఎమర్జెన్సీ వినియోగంగా వాడుతున్నారు. 2 నుంచి అయిదేళ్లు, ఆరు నెలల నుంచి రెండేళ్ల చిన్నారులకు కూడా టీకా ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు ఫైజర్ కంపెనీ చెప్పింది.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

పెంబి, సెప్టెంబర్ 20:: ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సూచించారు. పెంబి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా కవిత ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు సూచించే పనులను పరిష్కరించాలన్నారు. అటవీ, విద్యుత్, మత్స్య, ఎక్సైజ్, ఐటీడీఏ, ఉద్యానవన, సరస్వతి కెనాల్ శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైనా అధికారులపై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించి కలెక్టర్‌కు నివేదించాలని పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు.

విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినా వ్యక్తులు, పశువులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని వైటర్నరీ, విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, ఉపాధిహామీలో పనులు చేసిన కూలీలకు డబ్బులు చెల్లించడంలేదని, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల శంకర్, వైస్ ఎంపీపీ బైరెడ్డి గంగారెడ్డి, ఎంపీడీవో సాయన్న, తాసిల్దార్ రాజ్‌మోహన్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి మంత్రి బొత్స సవాల్

అమరావతి, సెప్టెంబర్ 20:ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకి మంత్రి బొత్స సత్యనారాయణ సవాల్ విసిరారు. అచ్చెన్నాయుడు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే, తాను కూడా రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో పోటీ చేసి ఎవరేంటో తేల్చుకుందామని అన్నారు. ప్రభుత్వాన్ని రద్దు చేయాలంటూ అదేపనిగా డిమాండ్ చేయడం సరికాదని హితవు పలికారు. 'అందరూ రాజీనామా చేయడం ఎందుకు? నువ్వు, నేను రాజీనామా చేద్దాం రా. నాకు ఈ సవాళ్లు నచ్చవు. దమ్ముంటే చూసుకుందాం రా, దమ్ముంటే కొట్టుకుందాం రా అనడానికి ఇవేమన్నా కుస్తీ పోటీలా?' అని వ్యాఖ్యానించారు.

ఎన్నికల బహిష్కరణ అంటూ టీడీపీ నేత అచ్చెన్నాయుడు చేస్తున్న వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి బొత్స అన్నారు. ముందు ఓటమిని అంగీకరించడం టీడీపీ నేర్చుకోవాలని సూచించారు. టీడీపీ నేతల మాటలు చూస్తుంటే వారికి ఓటమిని అంగీకరించే ధైర్యం లేదన్న విషయం అర్థమవుతోందని బొత్స విమర్శించారు. టీడీపీ పనైపోయిందన్న సంగతి స్పష్టమైందని, ఏపీ ప్రజలు సంక్షేమానికి పట్టం కట్టారని పేర్కొన్నారు.

ఏపీలో కరోనా కేసులు ఎన్నంటే..?

అమరావతి, సెప్టెంబర్ 20:ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య భారీగా తగ్గింది.

తాజాగా ఏపీ వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం.. గత 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా 42,679 శాంపిల్స్ పరీక్షించగా.. 839 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. తాజా టెస్ట్‌లతో కలుపుకుని.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన టెస్ట్‌ల సంఖ్య 2,77,63,761కు చేరింది.

ఇక, మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 20,39,529కి పెరగగా.. ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 20,11,063కు చేరుకుంది..

మరోవైపు.. ఇప్పటి వరకు 14,078 మంది కోవిడ్ బాధితులు రాష్ట్రంలో మృతిచెందగా.. ప్రస్తుతం యాక్టివ్ కేసులు 14,388గా ఉన్నాయని పేర్కొంది ఏపీ ప్రభుత్వం. ఇక, గుంటూరు, కృష్ణా జిల్లాలో ఇద్దరు చొప్పున, చిత్తూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున.. మొత్తం 8 మంది కోవిడ్ బాధితులు కన్నుమూశారు. ఇదే సమయంలో 1,142 మంది పూర్తిస్థాయిలో కోలుకున్నారని బులెటిన్‌లో పేర్కొంది సర్కార్.

వందశాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి

-అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠీ

లక్షెట్టిపేట రూరల్, సెప్టెంబర్ 20:: కొవిడ్ -19 నివారణలో భాగం లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలో వందశాతం వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యాక్సిన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఇంటింటికి తిరిగి వ్యాక్సిన్ వేసినట్టు అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాక్సిన్ కేంద్రాలలో భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య భద్రతపై నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, కౌన్సిలర్లు చల్ల నాగభూషణం, చింత సువర్ణ, మేనేజర్ శ్రీహరి, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది ఉన్నారు.

దేశంలో క్రీడల అభివృద్ధికి అమలు చేయాల్సిన కార్యచరణపై రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల క్రీడల మంత్రులతో చర్చించనున్న కేంద్ర క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:దేశంలో క్రీడలను మరింతగా ప్రోత్సహించడానికి అమలు చేయవలసి ఉన్న కార్యాచరణ కార్యక్రమంపై రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల క్రీడల శాఖల మంత్రులతో కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ సోమవారం చర్చించనున్నారు. వర్చువల్ విధానంలో ఈ సమావేశం జరుగుతుంది. ఇటీవల టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ మరియు పారాలింపిక్స్ క్రీడల్లో దేశం ఘన విజయాలను సాధించిన నేపథ్యంలో ఈ సమావేశం జరగనున్నది. దేశాన్ని అత్యున్నత క్రీడా దేశంగా అభివృద్ధి చేయడానికి, క్రీడలను మరింతగా ప్రోత్సహించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు ఈ విధంగా సహకరించాలన్న అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చిస్తారు. సమావేశంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీ నిషిత్ ప్రామాణిక్ కూడా పాల్గొంటారు.

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా కార్యక్రమాలు కూడా చర్చకు రానున్నాయి. దేశంలో క్రీడలు రాష్ట్రాల పరిధిలో ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని క్రీడలను ప్రోత్సహించి, అభివృద్ధి చేయడానికి పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో క్రీడల పోటీలను ఎక్కువగా నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులు మరియు పారా అథ్లెట్లను గుర్తించడానికి చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం తరపున శ్రీ ఠాగూర్ కోరనున్నారు. దీనివల్ల క్షేత్ర స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి అవకాశం కలుగుతుంది. పాఠశాల స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి సహకారం అందించే అంశాలు కూడా సమేవేశంలో చర్చకు వస్తాయి. నిధుల సమీకరణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చిస్తారు. క్రీడాకారులకు నగదు పురస్కారాలను అందించడానికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు నిధులను సమకూర్చాలని, వీటిని కేంద్రం అందిస్తున్న నిధులతో కలిపి అందించాలన్న ప్రతిపాదనపై కేంద్ర మంత్రి చర్చిస్తారు.

తొలిసారిగా 2018లో నిర్వహించిన ఖేలో ఇండియా క్రీడల పోటీలతో క్షేత్ర స్థాయిలో క్రీడల పోటీలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా యువత, విశ్వవిద్యాలయ, వింటర్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరచి ఖేలో ఇండియా రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు , ఖేలో ఇండియా కేంద్రాలను నెలకొల్పడం జరిగింది. ప్రస్తుతం దేశంలో 23 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 24 ఖేలో ఇండియా రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్రీడల అభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలను శ్రీ ఠాకూర్ వివరించి వీటికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలను కోరనున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి, అత్యుత్తమ శిక్షణా కార్యక్రమాలు, వైద్య సౌకర్యాలతో భావి ఛాంపియన్‌లను తీర్చి దిద్దడానికి సహకరించాలని ఆయన కోరనున్నారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో జిల్లా బ్లాకు స్థాయిలో విద్యా సంస్థల్లో క్రీడల పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించే కార్యక్రమం అమలు చేసే అంశం సమావేశంలో ప్రధాన అంశంగా చర్చకు రానున్నది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2019 లో ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమం దేశంలో ఫిట్నెస్ పై ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు తీసుకుని వచ్చింది. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్, ఫిట్ ఇండియా మొబైల్ యాప్, ఫిట్ వంటి వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో మరింత ఎక్కువగా పాల్గొనాలని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు శ్రీ ఠాకూర్ సోమవారం జరిగే సమావేశంలో కోరనున్నారు.

దేశంలో క్రీడల రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు , ఖేలో ఇండియా కేంద్రాలను నెలకొల్పడానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను శ్రీ ఠాగూర్ కోరుతారు.

మానవరహిత స్పేస్‌క్రాఫ్ట్‌ను లాంచ్ చేసిన చైనా

బీజింగ్, సెప్టెంబర్ 20:: మానవరహిత స్పేస్‌క్రాఫ్ట్‌ను చైనా సోమవారం లాంచ్ చేసింది. అంతరిక్షంలో ఆ దేశం నిర్మిస్తున్న సొంత స్పేస్ స్టేషన్‌కు అవసరమైన సామగ్రిని ఇందులో పంపింది. దక్షిణ చైనా హైనాన్ ప్రావిన్స్‌లోని వెంచాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్ సైట్ నుండి లాంగ్ మార్చ్ 7 రాకెట్‌ను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రయోగించింది. చైనా నిర్మిస్తున్న స్పేస్ స్టేషన్‌కు సామగ్రిని సరఫరా చేయడానికి కార్గో అంతరిక్ష నౌక టియాన్‌జౌ -3ను దీని ద్వారా పంపినట్లు చైనా మానవ సహిత అంతరిక్ష సంస్థ (అఓం) పేర్కొన్నట్లు అధికారిక వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. ఈ మిషన్‌కు సంబంధించిన 11 ప్రయోగాల్లో ఇది నాలుగోవదని వెల్లడించింది. చైనా సొంత స్పేస్ స్టేషన్ టియాంగాంగ్ 2022 నాటికి అందుబాటులోకి రావచ్చని భావిస్తున్నారు.

త్వరలోనే ఆన్‌లైన్ టికెటింగ్‌తో ప్రజలకు వినోదం : పేర్ని నాని

అమరావతి, సెప్టెంబర్ 20:త్వరలోనే ఆన్‌లైన్ టికెటింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు వినోదాన్ని అందించనున్నట్లు ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. సోమవారం ఏపీ ప్రభుత్వంతో సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, థియేటర్ యజమానులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆన్‌లైన్ టికెట్ల వ్యవహారంపై సమావేశంలో చర్చ జరిగింది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చిరంజీవి అంటే సీఎం జగన్‌కు గౌరవం ఉందన్నారు. ప్రజలకు మేలు చేసేలా ఎవరు ఏ విన్నపం చేసినా జగన్మోహన్‌రెడ్డి సర్కారు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన రేట్లపై సమావేశంలో సినీ పెద్దలకు వివరించినట్లు చెప్పారు. టికెట్ల ధరలపై ప్రజలెవరూ ప్రశ్నించే అవకాశం లేకుండా పారదర్శకతతో కూడిన రేట్లను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను మాత్రమే థియేటర్లలో అమలు చేయాలని, అందుకు ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా వినోదాన్ని అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. సమావేశంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల అభిప్రాయాలను తీసుకోవడంతో పాటు సమస్యలనూ గుర్తించినట్లు చెప్పారు. చిత్ర నిర్మాణంలో నిర్మాతలు కోరే వసతులు తెలుసుకున్నామని, సాధ్యమైనంత వరకు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

అనంతరం నిర్మాత నీ కల్యాణ్ మాట్లాడుతూ సినీ పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

ఆన్‌లైన్ టికెటింగ్